## మున్నూరు కాపు కమ్యూనిటీ హాళ్ల కోసం చైర్మన్‌కు వినతి



ఆసిఫాబాద్ : తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ గారి ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారామ్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమశేఖర్ పటేల్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సంఘ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని నాయకులు కోరగా, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మిట్ట దేవేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందూరి తిరుపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అన్నం రమేష్ , జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, జిల్లా కార్యదర్శి దేవర నేని రవీందర్, జిల్లా నాయకులు గోవిందుల రాజన్న, కస్తూరి అఖిలేష్, సుంకరి వెంకన్న, కొత్తిమీర సర్పంచ్ నాయకిని సత్యనారాయణ, అంబిలపు అశోక్. తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట

### పాఠశాలలు సందర్శించిన ఏసీఎంఓ ఉద్ధవ్

### వంద శాతం నమోదు, హాజరుపై ప్రత్యేక దృష్టి



ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని టీడబ్ల్యూపీఎస్ ధాబా, సవాతి, బండఖాసా, పాటగూడ, చిన్నపుల్లార, ఎస్ఎల్‌సీ చౌపన్‌గూడ పాఠశాలలను ఏసీఎంఓ పి.ఉద్ధవ్ గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి, ఫలితాలు మెరుగుపడేలా నాణ్యమైన బోధన అందించాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు, బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఒక్క విద్యార్థి కూడా బడి బయట ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నమోదు, హాజరు వంద శాతం ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. టీడబ్ల్యూపీఎస్ ధాబా పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారంటూ పత్రికల్లో వచ్చిన కథనంపై ఏసీఎంఓ ఆరా తీశారు. సర్పంచ్, గ్రామస్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించి, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కన్నెపల్లికనికి మట్టి రహదారి మరమ్మతు

### గుంతల్లో మురుం పోసి పనులు పూర్తి



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి సర్పంచ్ మోర్లె పార్వతి ఆదేశాల మేరకు కన్నెపల్లికనికి గ్రామాలను కలిపే మట్టి రహదారిపై ఏర్పడిన గుంతలను మురుం పోసి పంచాయతీ మరమ్మతు పనులు చేపట్టింది. వర్షాకాలంలో గ్రామ ప్రజలు, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పంచాయతీ నిరంతరం కృషి చేస్తోంది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోర్లె సమతరాజు, వార్డు సభ్యులు తిరుమలేష్, జయరాం, యువనాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వాడాలి

### ఎస్పీ నితికా పంత్

### తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు హెచ్చరిక



కొమరం భీం : ఆసిఫాబాద్ జిల్లా సోషల్ మీడియా వేదికలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా కించపరిచే పోస్టులు, వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు, అవమానకరమైన సందేశాలు, సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే కంటెంట్ ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం, అసభ్యకర వ్యాఖ్యలు, నకిలీ ఖాతాల ద్వారా వేధింపులపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 100/112 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.


## తిర్యాని అభివృద్ధి పనులపై ఎంపీ గోడం నగేష్ తనిఖీ..

## నాసిరకం ఇసుక వాడకంపై ఆగ్రహం

### రూ.3.75 కోట్ల శాటిలైట్ భవనం, రూ.3.25 కోట్ల జెడ్పీహెచ్ఎస్ భవనం నిర్మాణాలను పరిశీలించిన ఎంపీ



కొమురం భీం : ఆసిఫాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ గురువారం జిల్లాలో పర్యటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిర్యాని మండలంలోని సుంగాపూర్ గ్రామంలో రూ. 3.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శాటిలైట్ భవనం నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ గోడం నగేష్, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సుంగాపూర్‌లో రూ. 3.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వసతి భవనం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో నాసిరకం ఇసుక వాడుతున్నట్లు గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. వెంటనే నాసిరకం ఇసుకను తొలగించి నాణ్యమైన ఇసుకతోనే నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత ఏఈ (రాజు)కి ఆదేశాలు జారీ చేశారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రతి నిర్మాణం నాణ్యతతో పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కోటినాక విజయకుమార్, జిల్లా ఎన్నికల కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు కేసరి ఆంజనేయులు గౌడ్, బీజేపీ తిర్యాని మండల అధ్యక్షుడు సారా రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గాయంగి తిరుపతి, నాయకులు రంగు అరుణ్ కుమార్, శంకర్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు





# జిల్లా వ్యాప్తంగా ఫర్టిలైజర్ మాఫియా: నిలువుదోపిడీకి గురవుతున్న అన్నదాత

కొమురం భీం జిల్లా : వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లావ్యాప్తంగా సాగు పనులు ఊపందుకున్నాయి. అయితే,ఇదే అదనుగా భావించిన కొందరు ఫర్టిలైజర్,వ్యవసాయ మందుల దుకాణాల యజమానులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అడ్డగోలు దోపిడీకి తెరలేపారు. జిల్లాలోని ప్రధాన కేంద్రాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్,సిర్పూర్, రెబ్బెన,కెరమెరి, జైనూర్,వాంకిడితో పాటు అన్ని మండల కేంద్రాల్లోనూ ఎంఆర్పీ నిబంధనలు గాల్లో కలిసిపోతున్నాయి.

### అధికారుల కళ్లెదుటే మాయాజాలం

జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు అక్కడక్కడా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ఒక రకమైన స్టాక్ రిజిస్టర్లు చూపిస్తూ,వారు వెళ్లగానే అసలు విక్రయాలు వేరేలా సాగిస్తున్నారు. ప్యాకెట్లపై ఉన్న ధర కంటే వందల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ,బిల్లుల్లో మాత్రం కేవలం ఎంఆర్పీ ధరనే నమోదు చేస్తూ రైతులను దారుణంగా మోసగిస్తున్నారు.

### నిబంధనలు బూడిదలో పోసిన పన్నీరే!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణం ముందు వివరాలతో కూడిన ధరల నిల్వల బోర్డు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి




జిల్లా వ్యాప్తంగా 80% పైగా దుకాణాల్లో ఈ బోర్డులు ఊసే లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు కూడా ఈ నిబంధనల అమలుపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు.వ్యక్తమవుతున్నాయి.

### గిరిజన రైతులపై ప్రత్యేక గురి..

ఓటీపీల మాయాజాలం జిల్లాలోని ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలైన జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు) వంటి మండలాల్లోని అమాయక రైతులను టార్గెట్ చేస్తూ వ్యాపారులు సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు. ముందే విత్తనాలు, ఎరువులు ఇస్తామంటూ రైతుల నుంచి అడ్వాన్స్ డబ్బులు వసూలు చేస్తున్నారు. అవగాహన లేని గిరిజన రైతుల ఫోన్లకు వచ్చే ఓటీపీలను నైపుణ్యంగా సేకరించి, వారి పేర్లపై పీఎం–కిసాన్ లేదా ఇతర సబ్సిడీ ఈ–కేవైసీ ప్రక్రియలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ధరలపై ప్రశ్నిస్తే "ఎవరికైనా చెప్పుకోండి.. ఈ చిట్టీ చూపించండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. రైతు సంఘాల ఆగ్రహం.. తక్షణ చర్యలకు డిమాండ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్ని పథకాలు తెచ్చినా, క్షేత్రస్థాయిలో ఇలాంటి దళారీలు, దుకాణదారుల దోపిడీ వల్ల పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించి, అధిక ధరలకు విక్రయించే దుకాణాల లైసెన్సులను తక్షణమే రద్దు చేసి, యజమానులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రతి దుకాణం ముందు కచ్చితంగా స్టాక్, ధరల బోర్డులు ఉండేలా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలి.

# ఎల్‌నినో ప్రభావం..

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

### రైతులకు ఎలాంటి ముప్పు రాబోతుంది


### ప్రభుత్వం దీనిపైన చర్యలు తీసుకోబోతుందా

### సమస్య వలలో రైతు

ఆసిఫాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లతో మాట్లాడిన ఆయన.ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వలను నిరంతరం సమీక్షిస్తూ రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు బలహీనపడి వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, దీంతో వరి సాగుకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనా, ప్రాజెక్టులు,చెరువులపై ఆధారపడే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించడం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంత మేర తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

### ఎల్‌నినో సమస్య ఎలా మొదలవుతుంది?

ఎల్‌నినో అనేది సహజంగా కొన్ని సంవత్సరాలకు ఒకసారి ఏర్పడే ప్రపంచ వాతావరణ దృగ్విషయం. సాధారణంగా పసిఫిక్




మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో తూర్పు నుంచి పడమరకు వీచే ట్రేడ్ గాలులు సముద్రంలోని వెచ్చని నీటిని ఆసియాఆస్ట్రేలియా వైపు నెట్టుతాయి.కానీ ఈ గాలులు బలహీనపడినప్పుడు లేదా దిశ మారినప్పుడు వెచ్చని నీరు మధ్య,తూర్పు పసిఫిక్ ప్రాంతంలోనే పేరుకుపోతుంది. దీంతో సముద్ర ఉష్ణోగ్రతలు పెరిగి ప్రపంచ వాతావరణ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకుంటాయి. దీనినే ఎల్‌నినో అంటారు. ఈ మార్పుల ప్రభావంతో భారత నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది.ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. వర్షాలు ఆలస్యంగా రావడం,మధ్యలో ఎక్కువ రోజుల విరామం ఉండటం, చెరువులుప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. దీంతో వరి వంటి అధిక నీరు అవసరమయ్యే పంటలకు ఇబ్బందులు ఎదురై,రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాల్సిన అవసరం ఏర్పడుతుంది.

### ఎల్‌నినోను ఆపలేం.. ప్రభావాన్ని మాత్రం తగ్గించొచ్చు

ఎల్‌నినో అనేది ప్రపంచ వాతావరణంలో సహజంగా ఏర్పడే దృగ్విషయం కావడంతో దాన్ని నిలువరించడం సాధ్యం కాదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే ముందస్తు ప్రణాళికతో దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు. వర్షపాతం అంచనాలను అనుసరించి పంటల ప్రణాళిక రూపొందించడం,వరికి బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయడం వల్ల నష్టాలను తగ్గించవచ్చని పేర్కొంటున్నారు. అలాగే డ్రిప్,స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులు,వర్షపు నీటి సంరక్షణ, పంట బీమా, కరువును తట్టుకునే విత్తనాల వినియోగంపై ప్రభుత్వం, వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

# బలహాన్‌పూర్‌లో బడి ఏది?:

20 ఏళ్లుగా తీరని విద్యా కష్టం.. కాలినడకనే 3 కిలోమీటర్లు!

మంచిర్యాల,: మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచీని గ్రామపంచాయతీ పరిధిలోని బలహాన్‌పూర్ గ్రామ విద్యార్థుల పాలిట చదువు అనేది ఒక తీరని కలగా మారింది. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో, పసిపిల్లలు చదువు కోసం అష్టకష్టాలు పడుతున్నారని సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బలహాన్‌పూర్ గ్రామంలో ప్రస్తుతం 30 నివాసాలు ఉండగా, సుమారు 150 మంది జనాభా నివసిస్తున్నారు. ఇందులో దాదాపు 20 మందికి పైగా పాఠశాల వయసు పిల్లలు ఉన్నారు.కానీ గ్రామంలో బడి లేకపోవడంతో వీరంతా నిత్యం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేచీని గ్రామానికి కాలినడకన వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.




### తల్లిదండ్రుల్లో ఆందోళన

### బాలకార్మికులుగా మారుతున్న పిల్లలు

చిన్నారులు ఉదయం ఇంటి నుండి కాలినడకన బడికి బయలుదేరినప్పటి నుండి, తిరిగి క్షేమంగా ఇంటికి చేరేవరకు తల్లిదండ్రులు గుండె చేతుల్లో పెట్టుకొని ఆందోళన చెందుతున్నారు. దూరాభారం వల్ల కొందరు పిల్లలు చుట్టాల ఇళ్లల్లో ఉండి చదువుకుంటుండగా, మరికొందరు గురుకుల పాఠశాలల్లో చేరారు. అయితే, మరికొంతమంది విద్యార్థులు అంత దూరం నడవలేక చదువు మానేసి, తల్లిదండ్రులతో పాటు చేను పనులకు వెళ్తూ బాలకార్మికులుగా మారుతున్నారని బానేష్ ఆందోళన వ్యక్తం చేశారు.

### 2004లోనే మూతపడ్డ బడి

గతంలో 2004 వరకు ఈ గ్రామంలో ఒక మర్రి చెట్టు కింద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతులు జరిగేవని ఆయన గుర్తు చేశారు. వర్షం వస్తే ఆ రోజు పాఠశాలకు సెలవు ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. కనీసం పాఠశాల భవనం కూడా నిర్మించకపోవడంతో, ఆ తర్వాత అధికారులు ఆ బడిని పూర్తిగా ఎత్తివేశారని మండిపడ్డారు.

### ఉచితంగా ఇల్లు ఇస్తామంటున్న గ్రామస్థులు

"బలహాన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వ పాఠశాల మంజూరు చేస్తే, తాత్కాలికంగా తరగతులు నిర్వహించుకోవడానికి ఒక ఇంటిని ఉచితంగా ఇవ్వడానికి గ్రామ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని. కొండు బానేష్, సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని, బలహాన్‌పూర్ గ్రామ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే ఇక్కడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహేష్ బాబునిహారిక నిశ్చితార్థానికి హాజరైన డీసీసీ అధ్యక్షురాలు సుగుణ



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ పట్టణంలో గురువారం జరిగిన మహేష్ బాబునిహారిక నిశ్చితార్థ వేడుకకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హాజరై, కాబోయే దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తారీక్, భీమ్‌రావు, ప్రధాన కార్యదర్శి గాదవేణి మల్లేష్, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఇల్లూరి రాము, కనక నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పవన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షురాలు సుగుణ



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన వైద్య పవన్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ గురువారం వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పవన్ కుమార్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ విషాదాన్ని తట్టుకుని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తారీక్, భీమ్‌రావు, ప్రధాన కార్యదర్శి గాదవేణి మల్లేష్, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఇల్లూరి రాము, కనక నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

### కలెక్టర్ హరిత

### పెద్దపట్నాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్‌లోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ కె.హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు.ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో చేర్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

